

కొత్తగూడెంలో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, వాకిటి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం

భద్రాద్రి రామయ్య సాక్షిగా..

అభివృద్ధి బాధ్యత నాది

- జిల్లాను చూసినప్పుడల్లా గుండెల్లో సంతోషం ఉప్పొంగుతుంది
- ఇదే ఉత్సాహాన్ని ఊపిరిగా తీసుకుని రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెడతా
- ఉద్యమ పునాది ప్రాంతంలో రాష్ట్రమిచ్చిన నేత పేరుతో యూనివర్సిటీ
- ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీలే ఉన్నతస్థానంలో నిలుపుతాయి
- పాలనకు ఆయువు పట్టయిన శాఖలన్నీ ఇక్కడి మంత్రులకే
- ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మం/కొత్తగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆ భద్రాద్రి రామయ్య సాక్షిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిచేసే బాధ్యత తనదని, ఈ జిల్లాకు వచ్చినప్పుడల్లా తన గుండెల్లో సంతోషం ఉప్పొంగుతుందని.. అదే ఉత్సాహాన్ని ఊపిరిగా తీసుకుని రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రభాగంలో నిలబెడతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన- ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. డిప్యూటీసీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి యూనివర్సిటీ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యూనివర్సిటీ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి పునాదులుగా నిలిచిన పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతంలోనే తెలంగాణ ఇచ్చిన దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరుతో యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఈ యూనివర్సిటీ భారతదేశం గర్వించేలా ప్రపంచ దేశాల్లో గుర్తింపు వచ్చేలా ఈ ప్రభుత్వం అభివృద్ధి చేసి తీరుతుందన్నారు. రాష్ట్ర సాధనకు స్ఫూర్తినిచ్చిన ఈ ప్రాంతంలో 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరుతో యూనివర్సిటీ ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి ఇక్కడే పునాది రాయిపడిందని గుర్తు చేశారు. 2004-2014 సంక్షోభ సమయంలో సంక్షేమం వైపు దేశాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లారని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్రాన్ని ఇచ్చినందునే ఆయన పేరుతో దేశంలో ఎక్కడ లేని విధంగా ఏకైక యూనివర్సిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఖనిజ సంపదపై పరిశోధనలు జరగాలని, సింగరేణి లాంటి సంస్థలను పెంపొందించుకునేందుకు కొత్తగూడెంలో ఈ యూనివర్సిటీ స్థాపించడం జరిగిందన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కృష్ణ, గోదావరి జలాలను ఖమ్మం జిల్లా (మిగతా 6వ పేజీలో)

సీఎం పర్యటన సాగిందిలా..

- హెలీప్యాడ్‌కు చేరుకున్న సమయం: 4.50గంటలు
- వర్సిటీ శిలాఫలకం ఆవిష్కరణ: 5.02
- సభావేదికపైకి సీఎం రాక : 5.06
- ప్రసంగం ప్రారంభం : 5.26
- ప్రసంగం ముగింపు: 5.38
- తిరుగుపయనం : 5.46

ఘనంగా 'ఎర్త్‌సైన్స్' ప్రారంభోత్సవం

- హెలీకాప్టర్‌లో సాంకేతిక లోపం..
- మూడు గంటలు ఆలస్యంగా సీఎం పర్యటన
- 12నిమిషాల్లోనే ముగిసిన రేవంత్ ప్రసంగం

7

పట్టుబట్టి.. మంజూరు చేయించి..

- సీఎం రేవంత్‌తో ప్రారంభింపజేయించిన తుమ్మల
- యూనివర్సిటీ సాధనలో ఫలించిన మంత్రి కృషి
- నెరవేరిన ఉమ్మడి జిల్లా వాసుల విశ్వవిద్యాలయ ఏర్పాటు కల

7





సభకు హాజరైన యువత



నెలరోజులు గైర్హాజరైతే..

ఉద్యోగం ఉండదిక!

- ప్రభుత్వ టీచర్లకు ఇకపై పక్కాగా ముఖ ఆధారిత హాజరు
- విధులకు రాని వారిపై చర్యలకు విద్యాశాఖ నిర్ణయం
- పాఠశాలలకు ఆలస్యంగా వస్తే ఇక అంతే సంగతులు
- అనుమతి తీసుకోకుండా డుమ్మా కొట్టినా చర్యలే

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు అనుమతి లేకుండా పాఠశాలలకు డుమ్మా కొట్టినా.. నెల రోజులు పాఠశాలలకు గైర్హాజరైనా ఇక ఇంతే సంగతులు! ఇష్టారీతిన సెలవులు పెట్టే వారికి ఇకపై అలా చేయడం ఇకపై కుదరదు. చెప్పా పెట్టకుండా, అధికారికంగా సెలవు పత్రం ఇవ్వకుండా విధులకు నెల రోజులపాటు గైరా జరైతే వారిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ గత సోమవారం ముఖ గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్), మధ్యాహ్న భోజనం అమలు తదితర అంశాలపై డీఈవోలతో ఆన్‌లైన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో (మిగతా 6వ పేజీలో)

పోటీ చేయాలా? వద్దా?

- పంచాయతీ ఎన్నికలపై సింగరేణి ఉద్యోగులు, కార్మికుల్లో అయోమయం
- 'స్థానిక' ఎన్నికల్లో పోటీకి న్యాయస్థానం, ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికీ స్పష్టత ఇవ్వని యాజమాన్యం

ఇల్లెందు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులు, ఉద్యోగులు త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ విషయమై అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతించినప్పటికీ.. సంస్థ కాలరీస్ యాజమాన్యం స్పష్టతను ఇస్తూ అనుబంధ ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో ఆశావహులైన కార్మికులు, ఉద్యోగులు ఎటూ పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల ఘట్టం ప్రారంభమైనప్పటికీ.. సింగరేణి యాజమాన్యం కార్మికులు, ఉద్యోగులకు పోటీపై స్పష్టతను ఇవ్వలేదు. గతంలో రెండు సార్లు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సింగరేణి ఉద్యోగులు పోటీ చేయదలుచుకుంటే.. తమ ఉద్యోగాలకు రాజీనామా చేయాలనే నిబంధన విధిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఇదే నిబంధన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని ప్రభుత్వ సంస్థ ఉద్యోగులు తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేయాలనే ఆంక్షలు అమలవుతున్నాయి. అయితే కోల్‌బెల్ట్ పారిశ్రామిక ప్రాంతాల్లో సింగరేణిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన కార్మిక కుటుంబాలే అత్యధికంగా ఉండడంతో.. సింగరేణి కార్మికులు స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతించింది. ఇది జరిగి నెల రోజులు కావస్తున్నా..



ఎన్నికల కమిషన్ ఆదేశాలపై సింగరేణి యాజమాన్యం తన వైఖరిని వెల్లడించలేదు.

స్పష్టత ఇవ్వని సింగరేణి యాజమాన్యం

సింగరేణి పారిశ్రామిక ప్రాంతాల స్థానిక సంస్థల ఎన్నికల్లో సింగరేణి ప్రభావిత కుటుంబాలే నిర్ణయాత్మక పాత్ర వహిస్తున్నాయి. వివిధ రాజకీయ, కార్మిక స్వచ్ఛంద సంఘాలకు సింగరేణి కార్మికులు, ఉద్యోగులే అధికంగా నాయకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గతంలో కోల్ బెల్ట్ వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల్లో సింగరేణిలో కార్మికులు, ఉద్యోగులుగా పని చేసిన వారే మున్సిపల్ ఛైర్మన్లుగా, ఎంపీపీలుగా, ఎంపీటీసీలుగా, కౌన్సిలర్లుగా సర్పంచ్‌లుగా ఎన్నికయ్యేవారు. అయితే గత దశాబ్దకాలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సింగరేణి కార్మికులపై యాజమాన్యం ఆంక్షలు విధించింది. తమ ఉద్యోగాలకు రాజీనామా చేసిన తర్వాతే ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని పేర్కొనడంతో.. గతంలో రెండు సార్లు కార్మికులు (మిగతా 6వ పేజీలో)



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆమె నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కుముదిని మాట్లాడుతూ.. మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కూడా తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతి భద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఖమ్మం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు బాగున్నాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలు కొనసాగుతున్నాయన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు పూర్తయ్యిందన్నారు. మొదటి దశ నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎన్నికలతో ముడిపడిన అంశాలపై వచ్చే ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. పోలీసు కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఆర్వో ఏ. పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, సీపీవో శ్రీనివాస్, డీసీవో గంగాధర్, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాతలింగాల సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సుజాతను అభినందిస్తున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

ఊరుమ్మడి మాట..

ఏకగ్రీవ బాట..

- ఏడోసారి ఏకగ్రీవమైన పాతలింగాల సర్పంచ్ పదవి
- ఇదే బాటలో పలు గ్రామ పంచాయతీలు

6

మలివిడత పూర్తి.. తుదివిడతకు రెడీ

- పంచాయతీ ఎన్నికల రెండోవిడత నామినేషన్లు పూర్తి
- 6 మండలాల్లో 183 సర్పంచ్‌లు, 1,686 వార్డులకు దాఖలు
- నేటినుంచి పరిశీలన, 6న నామినేషన్ల ఉపసంహరణ
- మూడో విడతకు నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండోవిడతలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో నవంబరు 30నుంచి మంగళవారం వరకు నామినేషన్లను స్వీకరించారు. రెండోవిడతలో మొత్తం 6 మండలాల్లో 183 పంచాయతీలు, 1,686 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. రెండోవిడతలో ఒకే ఒక్క నామినేషన్ దాఖలైన పంచాయతీలను ఏకగ్రీవంగా అధికారులు ప్రకటించాల్సి ఉంది. మూడురోజుల పాటు వచ్చిన నామినేషన్లను అధికారులు బుధవారం నుంచి పరిశీలించనున్నారు. 4న అప్పీళ్లు స్వీకరించి.. 5న పరిష్కరిస్తారు. 6న మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉండగా.. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఆ వెంటనే అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఈ గ్రామపంచాయతీల్లో డిసెంబరు 14న పోలింగ్‌ను నిర్వహిస్తారు. ఇక తొలివిడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో స్వీకరించిన నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం గడువు ముగుస్తోంది. దీంతో తొలివిడత ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల సంఖ్య తేలనుంది. సాయంత్రం 3 గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడంతో పాటు వారికి గుర్తులను కేటాయించనున్నారు. వీరు 3వ తేదీ నుంచి ప్రచారపర్వంలోకి దిగనున్నారు. 11వతేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరగనుండగా.. మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుంది.

మూడో విడత ఎన్నికలు జరిగే మండలాలు

సింగరేణి, తల్లాడ, సత్తుపల్లి, కల్లూరు, వీఎం బంజర, వేంసూరు, ఏన్కూరు

మొత్తం పంచాయతీలు	184
వార్డులు	1,858
పోలింగ్ కేంద్రాలు	1,858
ప్రిసైడింగ్ అధికారులు	2,092
ఇతరపోలింగ్ సిబ్బంది	2,637

నేటి నుంచి 'మూడో విడత' ప్రక్రియ

పంచాయతీ ఎన్నికల మూడోవిడత ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మూడో విడతలో 184పంచాయతీలు, 1,858 వార్డులకు నామినేషన్లను స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 3,4,5 తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఇందుకోసం మొత్తం 188కేంద్రాలను ఏర్పాటు చేశారు. సింగరేణి మండలంలో 41, తల్లాడ మండలంలో 24, ఏన్కూరులో 21, కల్లూరు 23, సత్తుపల్లిలో 21, పెనుబల్లిలో 32, వేంసూరులో 26నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రామాలయంలో మరోసారి పట్టుబడ్డ

బయటి వస్త్రాలు?

- ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి..
- వారం రోజుల్లో రెండోసారి

7

అండర్ -17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి టీటీ పోటీలు షురూ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తుమ్మల యుగంధర్

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్- 17 బాలుర, బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పాత పది జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. పోటీల తొలిరోజు బాలికల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ఖమ్మం జట్టు ద్వితీయ, ఆదిలాబాద్ జట్టు తృతీయ స్థానాలలో నిలిచాయి. పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రామారావు, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ, కోచ్ ఓలేటి సాంబమూర్తి తదితరులు సమీక్షించారు.

ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలి

» టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తూమాటి శ్రీనివాస్



జీపీవో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పాలన అధికారులు ప్రజా ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని టీజీటీఏ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తోమాటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

జీపీవోఓఏటీజీ జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్రబాబు

జీపీవోఓఏటీజీ జిల్లా అధ్యక్షుడిగా చీమల నాగేంద్ర బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పడిగా హైమావతి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి బాలమురళి కృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ చల్లా శ్రీనివాసరావు, ముక్కాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా. బానోత్ రామచందర్ రావు , టీ.యం.యం. కిశోర్, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, కోట నరేష్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ జానిమియా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాచకొండ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక చేయూత

- మెప్మా ఆధ్వర్యంలో 92 దివ్యాంగుల సంఘాలు
- బ్యాంకు లింకేజీ నుంచి పీఎం స్వనిధి రుణాల మంజూరు
- ఖమ్మం జిల్లాలో ఆదర్శంగా కొనసాగుతున్న దివ్యాంగుల సంఘాలు
- రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిన బాలాజీ దివ్యాంగుల సంఘం



దివ్యాంగుల సంఘానికి రుణాలను అందిస్తున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య(ఫైల్)

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శరీర అవయవాలు సహకరించకపోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. దివ్యాంగుల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి జిల్లాలోని మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను నిర్మాణం చేసి వారు చేయగలిగిన వృత్తి, వ్యాపారాలను ప్రోత్సహిస్తుంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సాధారణ మహిళా స్వయం సహాయక సంఘాల వలే దివ్యాంగులకు దివ్యాంగుల సంఘాలను నిర్మాణం చేయటమే కాకుండా రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా ఖమ్మం జిల్లాలో నిర్వహణ చేస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ దివ్యాంగుల సంఘాల నిర్వహణలో ఖమ్మం జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందువరసలో ఉంచుతున్నారు. నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

దివ్యాంగుల సంఘాల నిర్వాహణలోను ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ప్రత్యేక ఖ్యాతీని పొందింది. ఏ జిల్లాలో లేని విధంగా ఇప్పటికే 92 దివ్యాంగుల సంఘాలను నిర్మాణం చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థలో-59, సత్తుపల్లి మున్సిపాలిటీలో-20, మధిర మున్సిపాలిటీలో-6, వైరా మున్సిపాలిటీలో-6 సంఘాలు నమోదు జరిగాయి.

ఒక్కో సంఘంలో ఐదుగురు సభ్యులు చొప్పున కొనసాగుతున్నారు. దివ్యాంగుల సంఘాలకు బ్యాంకు లింకేజీతో పాటుగా ప్రధాన మంత్రి స్వనిధి రుణాలు రెండో విడత తీసుకుంటున్నారు. వీధి వ్యాపారుల నుంచి మధ్య తరగతి వ్యాపారుల వరకు దివ్యాంగుల సంఘాల్లో సభ్యులుగా ఉంటూ ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని పొందుతున్నారు.

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశాలతో మెప్మా అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను దివ్యాంగుల కోసం కార్యాచరణ చేశారు. ఉచిత వైద్య శిబిరం, అవసరమైన వారికి ఉన్నత స్థాయి వైద్య పరీక్షలు నిర్వహించటం. ఇల్లెందు క్రాస్ రోడ్డులోని ఇండియన్ బ్యాంకు మేనేజరు పాపాని శ్రీనివాసరావు ద్వారా నానాజీ, ముత్యం దివ్యాంగుల సంఘాలకు ఒక్కో సభ్యునికి రూ.20వేల చొప్పున రెండు దివ్యాంగుల సంఘాలకు మొత్తం రూ.2లక్షల రుణాలను ఇవ్వనున్నారు. అదేవిధంగా 10 మంది దివ్యాంగులకు ప్రధానమంత్రి స్వనిధి పథకంలో భాగంగా రూ.15వేల చొప్పున రూ.1.50 లక్షల రుణాలను మంజూరు చేయనున్నారు.

రూ.6లక్షల రుణం పొందిన దివ్యాంగుల సంఘం

శారీరకంగా వైకల్యమైనా ఆర్థిక క్రమశిక్షణలో వారికి వారే చాటి అని నిరూపించారు ఖమ్మంలోని ఖానాపురానికి చెందిన బాలాజీ దివ్యాంగుల సంఘం సభ్యులు. 2017లోనే రాష్ట్రంలోనే దివ్యాంగుల సంఘంగా ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ అంశలంచలుగా బ్యాంకు లింకేజీలను తీసుకొని తిరిగి క్రమపద్ధతిలో వాయిదాలు చెల్లిస్తూన్నారు. ఇలా 2025 నాటికి ఇల్లెందు క్రాస్ రోడ్డులోని గ్రామీణ వికాస్ బ్యాంకు ద్వారా రూ.6లక్షల రుణాలను పొందారు. రాష్ట్ర స్థాయిలో దివ్యాంగుల సంఘాల్లో అగ్రగామిగా ఖ్యాతీ పొందారు.

రామయ్యను దర్శించుకున్న సీఎం సెక్రటరీ

భద్రాచలం/దుమ్ముగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని, పర్ణశాల రామాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. దేవస్థానం తరఫున శాలువ, జ్ఞాపిక, స్వామి వారి ప్రసాదాన్ని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, వైదిక సిబ్బంది అందజేశారు. పర్ణశాలలో బాపు కుటీరం, నారచీరల ప్రాంతాలను పరిశీలించారు. స్థల పురాణాన్ని వేదపండితులు వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, వేద పండితులు మల్లూరి రవికుమార్ శర్మ, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, తహసీల్దార్ అశోక్‌కుమార్‌లుండగా, సీఐ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం

రామాలయ ప్రాంగణంలోని దాసాంజనేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు

అద్భుత విజయాలు సాధించాలి

» ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అవార్డులు అందిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల నైపుణ్యాలు కలిపి ప్రభుత్వ విద్య ఉన్నత స్థాయి లక్ష్యాలను చేరేందుకు కృషి కొనసాగుతుందని కలెక్టర్ అనుదీప్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు ప్రభుత్వ పాఠశాలల మధ్య పోటీగా నిర్వహించిన పాఠశాల పరిశుభ్రత, నీటి నిర్వహణ, పర్యావరణ సంరక్షణ, విద్యార్థుల్లో స్థిరమైన జీవనశైలి అలవాటు పెంపు పట్ల ప్రతిభ కనబర్చిన పలు పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశంసపత్రాలు అందించి, వారిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మనకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల కోసం సర్వేలో పాల్గొని అత్యధిక స్కోర్ పొందిన 8 పాఠశాలలు జిల్లా నుంచి ఎంపిక కావడం గర్వకారణమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైనీ, జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ బాజోజు ప్రవీణ్ కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఏఎంవో ప్రభాకర్, తదితరులున్నారు.

పామాయిల్ గెలల ధర.. టన్ను రూ.19,598

» గత నెలకంటే స్వల్పంగా టన్నుకి రూ.83 తగ్గుదల

అశ్వారావుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నవంబరు నెలలో సేకరించిన పామాయిల్ గెలల టన్ను ధర రూ.19,598లుగా ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. గత నెలలో టన్ను ధర రూ. 19,681లు ఉండగా ఈనెలలో స్వల్పంగా టన్నుకి రూ.83లు తగ్గింది. అంతర్జాతీయంగా నూనె ధరలలో హెచ్చుతగ్గుల కారణంగా ధరలో ఈ మార్పు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. నవంబర్ నెలలో సేకరించిన గెలలకు పైన తెలిపిన ధరను చెల్లిస్తారు. గెలల కోతలో రైతులు అధికారులు చెప్పిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరారు.



భద్రాద్రి రామయ్య సాక్షిగా..

(5వ పేజీ తరువాయి)

బీడుభూములకు తరలించి, పంటలు పండించి సిరులు కురవాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకే జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీతారామ, సాగునీటి ప్రాజెక్టులు కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిపించాయన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌లకు మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ప్రాధాన్యమిచ్చి భారతావనిని ప్రపంచ చిత్ర పటంలో నిలబెట్టారని, దేశంలో ఆకలి కేకలను తీర్చేందుకు కృషి చేసారన్నారు. నేడు దేశంలో అత్యధిక ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసి ప్రతీ వారికి అన్నం అందిస్తున్న ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. బాక్రా నంగల్ నుంచి నాగార్జున సాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరాం సాగర్ వరకు నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, శ్రీశైలం ప్రాజెక్టులన్నీ ఆ నాటి ప్రధాని నెహ్రూ పాలనలో ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆనాడే అత్యధిక యూనివర్సిటీలు నెహ్రూ ప్రారంభించారన్నారు. అదే స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలో ఉన్నత స్థానంలో నిలిపేడుతుందని ఈ ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసించి పనిచేస్తుందన్నారు.

ఆయువుపట్టున్న శాఖలన్నీ ఆ ముగ్గురిదగ్గరే..

పాలనకు ఆయువుపట్టు అయిన శాఖలన్నీ మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి వద్దనే ఉన్నాయని, అన్నీ ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయన్నారు. ఆ ముగ్గురు అనుకుంటే ప్రభుత్వంలో జరగనిదేమీ లేదన్నారు. ఖమ్మం జిల్లాకు ఏం కావాలన్నా మీరు అడిగితే నిధులు, పనులు మంజూరు చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ చీరల పంపిణీ లాంటి ప్రముఖ పథకాలన్నీ ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని, వీరిలో ఖమ్మం మంత్రులే కీలక పాత్ర వహిస్తున్నారని కొనియాడారు. భద్రాద్రి శ్రీరాముల వారి సాక్షిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని జిల్లాలతో పాటు అభివృద్ధి పథం వైపు నడిపించే బాధ్యత నాది అని, మీ అందరు ఏవిధంగా అండగా ఉండి ఆశీర్వదించారో... మంచి ప్రభుత్వం ఉంటే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తాయి. ఈ సభలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రఘురామరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, రాగమయి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, విజయబాబు, పొదెం వీరయ్య, నాయుడు సత్యనారాయణ, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు తదితరులున్నారు.

ప్రపంచంలోనే యూనిక్ యూనివర్సిటీ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దేశానికే ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ తలమానికంగా నిలువనుండగా.. ప్రపంచంలో కూడా యూనిక్ యూనివర్సిగా వర్ధిల్లనుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచంలోనే దీటుగా ఉండేలా కళాశాలను నెలకొల్పనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ దేశాల్లో కొన్ని సబ్జెక్టులకే పరిమితమైన యూనివర్సిటీలున్నాయని మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అన్ని విభాగాలతో రూపుదిద్దుకుందని, దేశం గర్వించదగిన విధంగా యూనివర్సిటీలో విద్యావకాశాలు లభించబోతున్నాయని, ఇక్కడ చదివే విద్యార్థులు దేశ, విదేశాల్లో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ఉండాలని ఆయన ఎన్ని సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటే అన్ని సంవత్సరాలు ఖమ్మం జిల్లా ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సీఎం కృషితో కొత్తగూడెం థర్మల్ పవర్ ప్రాజెక్టు పునరుద్ధరణ చేశారని, అదేవిధంగా కొత్తగూడేనికి ఎయిర్‌పోర్టు, భద్రాద్రికి రైల్వేలైన్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా ఉన్న సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.20వేల కోట్లను మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనన్నారు. తద్వారా ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కాబోతోందని, కోల్ ఇండియా సింగరేణి కాలరీస్, ఎన్ఎండీసీ లాంటి సంస్థలు విశ్వవిద్యాలయానికి తోడ్పాటునివ్వాలని కోరారు. ఎన్ని కష్టాలు ఎదురైనా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.


దేశానికి దిక్సూచిగా తెలంగాణ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



దేశంలోనే డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ అత్యున్నతమైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జరిగిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభసభలో ఆయన మాట్లాడారు. భూమి లోపల పొరలు, ఖనిజాలు, ఉపరితల అంశాలపై పరిశోధనలతో పాటు ప్రపం చ విజ్ఞానాన్ని అందించే విశ్వవిద్యాలయంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ దేశానికే తలమానికంగా నిలుస్తుందన్నారు. మ న్మోహన్‌సింగ్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తామన్నారు.

గతంలో రాష్ట్ర ప్రదాతను విస్మరించారు


● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ రాష్ట్రాన్నిచ్చిన మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించి యూనివర్సిటీకి ఆయన పేరును పెట్టిన ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదని, గత పదేళ్లు పాలించిన వారు ఆయన్ను విస్మరించారని, ఒక పథకానికి కూడా మన్మోహన్‌సింగ్ పేరు పెట్టలేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మన్మోహన్‌సింగ్ యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఖనిజ సంపదలకు నిలయంగా ఉన్న జిల్లాలో మన్మోహన్‌సింగ్ పేరిట విశ్వవిద్యాలయం నెలకొల్పడం ఆయన సేవలకు గుర్తింపు లభించిందన్నారు.

నియోజకవర్గంపై సీఎంకు ప్రత్యేక అభిమానం

● కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



సీఎం రేవంత్‌రెడ్డికి కొత్తగూడెం నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానం ఉందని, తాము ఏ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే పరిష్కరించారని ప్రశంసించారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు, సీతారామ ప్రాజెక్టు, కేటీపీఎస్ ద్వారా 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం పునరుద్ధరణ జరిపించారని ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పోటీ చేయాలా? వద్దా?

(5వ పేజీ తరువాయి)

వెనుకడుగు వేశారు. గతంలో సింగరేణిలో కార్మికులు, ఉద్యోగులుగా పనిచేసిన చొప్పరి రాజమళ్లు, మొలబాబు ఇల్లెందు మున్సిపాలిటీ చైర్మన్లుగా ఎన్నిక కాగా.. బెల్లంపల్లిలో మున్సిపల్ చైర్మన్లుగా సూరిబాబు, చంద్రశేఖర్, రాజేశ్వర్, రామగుండం మున్సిపల్ చైర్మన్‌గా బడికెల రాయలింగు ఎన్నిక కాగా.. కొత్తగూడెంలో కూసన వీరభద్రం, ఇల్లెందులో కె.సారయ్య వైస్ ఎంపీపీలుగా ఎన్నికయ్యారు. అదే విధంగా ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్యతో పాటు అనేక మంది సర్పంచ్‌లుగా, కౌన్సిలర్లుగా ఎంపీటీసీలుగా కోల్‌బెల్టులో ఎన్నికైన వారిలో ఉన్నారు. ఒకవైపు సింగరేణిలో ఉద్యోగాలు చేస్తూనే.. మరోవైపు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో సింగరేణి కార్మికులుగా ఉద్యోగాలు చేసిన దాసరి నర్సయ్య, గుండా మల్లేశ్, కొప్పుల ఈశ్వర్, బోడ జనార్దన్, ఊకే అబ్బయ్యలు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేశారు. గతంలో సింగరేణి ఉద్యోగులుగా ఉండి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారిలో కొందరికి సింగరేణి యాజమాన్యం చార్జిషీట్లు సైతం జారీ చేయగా.. అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో చర్యలకు యాజమాన్యం వెనుకడుగు వేసింది. ఇదే క్రమంలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో.. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు సింగరేణి కార్మికులు అర్హులేనంటూ పేర్కొన్నప్పటికీ.. యాజమాన్యం చర్యలు పూనుకుంటుండటంతో పోటీలకు కార్మికులు వెనుకడుగు వేస్తూ వస్తున్నారు.

● సింగరేణిలో అంతర్మథనం.. కార్మికుల్లో అయోమయం

సింగరేణిలో కార్మికులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులేనంటూ ఎన్నికల కమిషన్ పేర్కొన్నప్పటికీ.. సింగరేణి యాజమాన్యం స్పష్టతను ఇవ్వక పోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఓవైపు నామినేషన్ల ఘట్టాలు పూర్తి కావస్తున్నప్పటికీ స్పష్టతను ఇవ్వకపోవడంలో అంతర్యం ఏంటని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనవారు అనేక మంది విధులకు ఎగనామం పెడుతూ ప్రజా ప్రతినిధులుగా అధికార పార్టీలను అడ్డం పెట్టుకుని ఏకంగా సింగరేణి అధికారులపైనే పెత్తనాలకు పూనుకున్నారనే ఆరోపణలు ఉండడంతో.. యాజమాన్యం స్పష్టతను ఇవ్వకుండా మిన్నకుండిపోయినట్టు తెలిసింది. ఈ పరిణామాలతో తాము ఎన్నికల్లో పోటీ చే యాలా!? వద్దా!? అన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు.

నెలరోజులు గైర్హాజరైతే.. ఉద్యోగం ఉండదిక!

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖపై సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్ అమలు తర్వాత ఉపాధ్యాయుల హాజరు శాతం, అనధికారిక గైరా జరు.. తదితర అంశాలపై చర్చించారు. ఈ వివరాలు డీఈవోలకు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందువల్ల వాటిపై తరచూ సమీక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు నెలరోజుల పాటు అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ జరిపి, ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని డీఈవోలకు సూచించారు. వాస్తవానికి ఒక రోజు అనధికారికంగా పాఠశాలకు రాకున్నా చర్యలు తీసుకోవచ్చని..

కాకపోతే అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడ్డానని, రోడ్డు ప్రమాదానికి గురయ్యానని.. ఇలా ఏదో ఒక సాకు చూపి కో ర్టుల్లో కేసులు వేస్తారన్న చర్చ జరిగింది. దీంతో నెల రోజులు చూసి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సూచించారు.

ఆలస్యంగా వచ్చేవారిపైనా..

ఖమ్మం జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ హాజరు ఉన్నప్పటికీ.. ఏవో సాకులు చెప్పి పాఠశాలలకు ఆలస్యంగా రావడం, పోవడం ఇక కష్టమేనని తెలుస్తోంది. గత ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన ఎఫ్ఆర్ఎస్ ద్వారా టీచర్లు వచ్చిన, వెళ్లిన సమయం నమోదవుతోంది. కాకపోతే ఈ వేళలను ఎవరూ పట్టించుకోవడం లేదు. విధులకు హాజరయ్యారా!? లేదా!? అన్నదే లెక్కలోకి తీసుకుంటున్నారు. ఇక నుంచి ఆలస్యంపై కూడా దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. 'ముఖ గుర్తింపు హాజరు అమలుతో హెచ్‌ఎంలకు ఇబ్బందులు తప్పాయి. గతంలో కొంత ఆలస్యంగా వస్తా.. ముందుగా వెళతా అని కొందరు అడిగేవారు. భవిష్యత్‌లో ఆ లెక్కలు కూడా తీస్తారన్న ఆలోచనతో ప్రస్తుతం మమ్మల్ని ఎవరూ అడగడం లేదు' అని ఓ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఏటా కొందరు టీచర్లు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తుంటారు. అలాంటివారు ఎక్కువగా విదేశాల్లోని తమ పిల్లలు, భాగస్వాముల వద్దకు వెళ్తారు. ఆరు నెలలు అని అనుమతి తీసుకొని ఒకటి, రెండేళ్లయినా విధులకు రాని వారున్నారు. అలాంటి వారిని గత రెండేళ్లలో కొద్ది మందిని మాత్రమే ఉద్యోగం నుంచి తొలగించామని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కొందరు కనీసం సెలవులను పొడిగించుకుంటామని కూడా సమాచారం ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఉద్యోగం నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు సూచించారు.

ఊరుమ్మడి మాట.. ఏకగ్రీవ బాట..

పల్లె సమరం 2025

పంచాయతీపోరు రసవత్తరంగా మారుతోంది. రెండోవిడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. ఈ క్రమంలో పలు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా.. మరికొన్ని గ్రామాలు ఏకగ్రీవ బాటలో నడు స్తున్నాయి. ఈ మేరకు ఆయా గ్రామాల్లో నాయకులు పార్టీల శ్రేణులు, అభ్యర్థులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

పాతలింగాల సర్పంచ్ పదవికి ఒక్కరే నామినేషన్

కామేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లి మండల పరిధిలోని పాతలింగాల సర్పంచ్‌ను ఏడోవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నామినేషన్ దాఖలుకు చివరిరోజైన మంగళవారం ఒక్కరే నామినేషన్ వేశారు. గ్రామంలో దివంగత నేతలు రాంరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్‌రెడ్డి ఉన్న నాటి నుంచి ఎప్పుడూ ఏకగ్రీవంగానే ఎన్నుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్న పాతలింగాలలో ఎప్పుడు సర్పంచ్ ఎన్నికలు జరగలేదు. వ్యవసాయ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో పాటు, గ్రామ పెద్దలు కలిసి సంయుక్తంగా కలిసి గత సర్పంచ్ భార్య అయిన కిన్నెర సుజాతను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నుకున్నారు. మంగళవారం గ్రామస్థులతో కలిసి సుజాత, వార్డు సభ్యులు నామినేషన్ ధాఖాలు చేశారు.

కాంగ్రెస్ ఖాతాలోకి ఆచార్లగూడెం!

నేలకొండపల్లి: పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బోణీ కొట్టింది. నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుదారు కొలికపొంగు ఉప్పలమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయటంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. దీనిపై అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది. కట్టుకాసారం పంచాయతీలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒప్పందం కుదుర్చుకుని సర్పంచ్ కాంగ్రెస్, ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌కు ఒప్పందం చేసుకున్నట్టు తెలుస్తోంది. కానీ కాంగ్రెస్‌లో అధికారిక అభ్యర్థికి వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయటంతో ఏకగ్రీవం కాలేదని సమాచారం.

తిమ్మక్కపేట ఏకగ్రీవం

తిరుమలాయపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మక్కపేట గ్రామపంచాయతీ ఏకగ్రీవమైంది. సర్పంచ్ అభ్యర్థిగా రేపాకుల భద్రమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్లలో భాగంగా మంగళవారం చివరిరోజు కావడంతో భద్రమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం కాగా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

గోవిందాపురం పాలకవర్గమంతా..

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం గోవిందాపురం గ్రామపంచాయతీ కాంగ్రెస్ వశమైంది. సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన రంగిశెట్టి కళావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నాటికి సర్పంచ్, 8వార్డు సభ్యుల ఎన్నికకు ఒక్కో నామినేషన్ మాత్రమే మిగిలింది. దాంతో సర్పంచ్‌గా కళావతి, ఉపసర్పంచ్‌గా గుజ్జర్లపూడి నాగభూషణం (ఆరో వార్డు), వార్డుసభ్యులుగా బండి శ్రీలత, ఓర్సు కృష్ణ, పల్లపు ఉపేంద్ర, పెరుమాళ్లపల్లి వెంకయ్య, వేముల ఉషారాణి, సాలె మరియమ్మ, రామాల దీపిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పలుగ్రామాల్లో ఏకగ్రీవ ప్రయత్నాలు

చింతకాని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలంలో అధికార పార్టీ మెజారిటీ స్థానాలు దక్కించుకునేలా పావులు కదుపుతోంది. మంగళవారం లచ్చగూడెం గ్రామంలో పది వార్డులు ఏకగ్రీవమయ్యేలా ప్రత్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకోగా, బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గురిజాల హనుమంతరావు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఇండిపెండెంట్ అభ్యర్థితో తలపడే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి కొప్పుల రజని విజయం సునాయసం కానుంది. సీతంపేట గ్రామంలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఆళ్ల మణెమ్మ అనూహ్యంగా ఉపముఖ్యమంత్రి భట్టి సతీమణి మల్లు నందిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అక్కడ నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు నామినేషన్‌ను ఉపసంహరించుకునేలా నేతల మంతనాలు జరుపుతున్నారు. అనంతసాగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు నామినేషన్‌ను దాఖలు చేయగా జిల్లా నాయకుల సూచనల మేరకు ఒక్కరు మినహా మిగతా వారు నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే రేపల్లెవాడ కాంగ్రెస్ ఖాతాలో చేరింది.

ఘనంగా 'ఎర్త్‌సైన్స్' ప్రారంభోత్సవం

హెలీకాప్టర్‌లో సాంకేతిక లోపం..
మూడు గంటల ఆలస్యంగా పర్యటన
12 నిమిషాల్లోనే ముగిసిన సీఎం ప్రసంగం

కొత్తగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం మంగళవారం కొత్తగూడెంలో ఘనంగా జరిగింది. వాస్తవంగా ముఖ్యమంత్రితో భూమి పూజ కార్యక్రమాన్ని గత ఆగస్టులోనే నిర్వహించాలని భావించారు. అయితే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో నిబంధన ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాతే ముఖ్యమంత్రిని ఆహ్వానించాలని నిర్ణయించారు. అనంతరం యూనివర్సిటీకి రాష్ట్రం ఇచ్చిన సమయంలో ప్రధానిగా ఉన్న ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు ఖరారు చేసి, కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. అనంతరం ప్రజాపాలన రెండేళ్ల కాలం పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సీఎం చేతులమీదుగా మంగళవారం ప్రారంభించాలని నిర్ణయించగా.. మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాం


వర్సిటీ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు

నాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు కలిసి ఆయన యూనివర్సిటీ శిలాఫలకం ఆవిష్కరించారు.

చకచకా కార్యక్రమం

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఉదయం గాంధీభవన్‌లో పీసీసీ సమావేశం పూర్తి చేసుకున్న అనంతరం ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా దేశంలోనే తొలి ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభించేందుకు కొత్తగూడెం వచ్చి.. సాయంత్రం ఆయన ఢిల్లీ వెళ్లాల్సి ఉంది. అయితే పీసీసీ సమావేశం ముగిసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు కొత్తగూడెం చేరుకోవాల్సి ఉండగా.. ఆయన రావాల్సిన హెలీకాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆయన పర్యటన మూడు గంటలపాటు ఆలస్యమైంది. దాంతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం, బహిరంగ సభా కార్యక్రమాలను చకచకా కానిచ్చేశారు. సాయంత్రం 4.50 గంటలకు ఆయన కొత్తగూడెం చేరుకోగా.. సీఎం తిరిగి 5.46 గంటలకు వెళ్లారు. గంట వ్యవధిలో కేవలం 12 నిమిషాలు మాత్రమే ప్రసంగించడం కొసమెరుపు. కాగా సీఎం రాక ఆలస్యమవడంతో సభకు వచ్చిన కొందరు వెనుదిరిగినా.. మిగిలినవారంతా సీఎం రాకకోసం వేచి ఉన్నారు. అంతసేపు వేచి ఉన్నా సీఎం రాకతో విద్యార్థులు, యువత కేరింతలు కొట్టారు.

ముఖ్యమంత్రికి పలువురి ఘన స్వాగతం:

డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ కార్యక్రమానికి మంగళవారం కొత్తగూడెంకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి పలువురు ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఐడిఓసి పరిధిలో ఉన్న ఎలిపాడ్ వద్దకు చేరుకున్న సీఎంకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపీలు రఘురాం రెడ్డి, బలరాం నాయక్ ఎమ్మెల్యేలు కూనం నేని సాంబశివ రావు రాందాస్ నాయక్, పాయ వెంకటేశ్వర్లు, కోనేరు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాపరెడ్డి, రిజిస్టర్ రామచంద్ర, ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సభ సైడ్ లైట్స్..



సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఆలస్యం అయినప్పటికీ.. సభా ప్రాంగణంలో ఉన్న వారికి ఇబ్బందిగా అనిపించకుండా.. సభావేదిక పక్కన ఏర్పాటు చేసిన కళా బృందం అలరించింది. వారు పాడిన ఆటపాటలు, బంజార నృత్యం, డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తున్న సమయంలో సభకు వచ్చిన విద్యార్థులు, యువకులు, కార్యకర్తలు డాన్సులు వేశారు.

- సభా వేదికపై వ్యాఖ్యాతగా వ్యవహరించిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి స్ఫూర్తిని ప్రశంసిస్తూ.. ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌లో మెస్సీ వర్సెస్ రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఉందని చెప్పడంతో విద్యార్థుల కేరింతలు కొట్టారు.
- సభా ప్రాంగణంలో కొత్తగూడెంకు చెందిన పకృతి ప్రేమికురాలు చిన్నారి రజువ నైనిక పచ్చని చెట్లను కాపాడాలని... ఆ చెట్లే మనకు ఆక్సిజన్‌ను అందిస్తాయంటూ వేషదారణలో పలువురిని ఆకట్టుకుంది.
- సభా వేదికపై ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీకి సంబంధించి ప్రముఖ ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి డిజైన్ చేసిన ప్లాన్ ఏవీ పలువురిని ఆకట్టుకుంది.
- సమయం లేకపోవడంతో త్వరత్వరగా తమ ప్రసంగాన్ని వినిపించిన రాష్ట్ర మంత్రులు, కొత్తగూడెం ఎమ్మెల్యే.
- మరోసారి వస్తానని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు హామీఇచ్చి ఢిల్లీకి వెళ్తున్నానని బయలు దేరిన సీఎం రేవంత్ రెడ్డి.

ఉత్సాహంగా ప్రజాపాలన విజయోత్సవ సభ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం/ కొత్తగూడెం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగూడెం పర్యటన ఉత్సాహంగా సాగింది. సీఎం ప్రసంగం కాసేపైనా సభకు వచ్చిన వారిలో జోష్ నింపింది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెంలో సాగిన ప్రజాపాలన విజయోత్సవ సభను పరోక్షంగా ఎన్నికల ప్రచారానికి కూడా ఉపయోగపడింది. జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభకు డ్వాక్రా మహిళలతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి రాక ఆలస్యమైనా పొద్దుపోతున్నా రేవంత్‌రెడ్డి కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో విద్యార్థులు, యువకులు కేరింతలు కొట్టారు.



పట్టుబట్టి.. మంజూరు చేయించి..

యూనివర్సిటీని ప్రారంభింపజేసిన తుమ్మల నాగేశ్వరరావు
ఫలించిన మంత్రి కృషి...
నెరవేరిన వర్సిటీ ఏర్పాటు కల

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం/కొత్తగూడెం డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ లేని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయించాలని పట్టుబట్టి మరీ యూనివర్సిటీని మంజూరు చేయించి, ఆయన అనుకున్న విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ యూనివర్సిటీని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభింపజేశారు. కొత్తగూడెం మైనింగ్ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేయాలని రెండున్నర దశాబ్దాలుగా మంత్రి తుమ్మలప్రయత్నం సాగిస్తున్నారు. 1976లో సింగరేణి మైనింగ్ కళాశాలగా ఏర్పడిన ఈ కాలేజీని 1994లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పడి మంత్రిగా తుమ్మలనాగేశ్వరరావు దీనిని కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువెళ్లి ఇంజనీరింగ్ కాలేజీగా అభివృద్ధి చేసి మైనింగ్ కోర్సుతో పాటు ఇతర టెక్నికల్ కోర్సులను ఏర్పాటు చేశారు. సుమారు 300కుపైగా ఎకరాల భూమి కలిగిఉన్న ఈ కాలేజీని యూనివర్సిటీగా అభివృద్ధిచెందాలని మంత్రి తుమ్మల భావించారు. అది అప్పట్లో సాధ్యం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల బాధ్యతలు చేపట్టడంతో గతేడాది కాలంగా కొత్తగూడెంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పలువురు విద్యావంతులతో చర్చించి రూపకల్పన చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు ఆయన సానుకూలత తెలపడంతో పాటు ఈ యూనివర్సిటీ ఏర్పాటు వల్ల జరిగే రాష్ట్ర, దేశ ప్రయోజనాలను కూడా చర్చించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు ఒక రూపం వచ్చిన తరువాత కొత్తగూడెంలో ఏర్పాటు చేసే ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరును సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.


రేవంత్‌ను సత్కరిస్తున్న మంత్రి తుమ్మల

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ప్రధానిగా మన్మోహన్‌సింగ్ పేరుతో యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా రాష్ట్రం నుంచి ఆయనకు సముచిత గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రికి తెలపడం, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలత వ్యక్తం చేశారు. దీంతో జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి కూడా కొత్తగూడెం యూనివర్సిటీ ఏర్పాటుపై వారితో కూడా చర్చించారు. మొత్తం మీద యూనివర్సిటీ ప్రతిపాదన, మంజూరు, ప్రారంభానికి పట్టువదలని విక్రమార్కుడిలా కృషిచేశారు. సుదీర్ఘ కాలంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించింది. జిల్లా ప్రజల కల నెరవేరింది. ప్రారంభోత్సవ సభలో విశ్వవిద్యాలయ ఏర్పాటులో మంత్రి తుమ్మల చేసిన కృషిని సీఎం ప్రశంసించారు.

మంత్రి తుమ్మలకు సీఎం ప్రశంసలు

ప్రజాపాలన విజయోత్సవ సభ, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీసుకున్న చొరవకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీహరితో కలిసివచ్చిన రేవంత్ రెడ్డి కొత్తగూడెం హెలిపాడ్ వద్ద స్వాగతం పలికిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి పక్కనే ఉండి తుమ్మల యూనివర్సిటీ గురించి, గతంలో తాను చేసిన అభివృద్ధి గురించి వివరించారు. సభ అధ్యక్షుడిగా తుమ్మల సభను విజయవంతం చేయడం, అలాగే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటే ఖమ్మంజిల్లా అండగా ఉంటుందని చెప్పడం మంత్రి తుమ్మల సీఎంకు మరింత చేరువయ్యారు. ముఖ్యమంత్రి కూడా తుమ్మల కృషిని ప్రశంసించారు. తక్కువ సమయంలోనే సభను నిర్వహించడం, ప్రజల నుంచి వచ్చిన ఉత్సాహాన్ని చూసి సీఎం కూడా ముగ్ధులయ్యారు.

జిల్లా అధికారులకు తుమ్మల ప్రశంసలు

సీఎం కొత్తగూడెం సభను విజయవంతం చేసినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులకు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూనివర్సిటీ అధ్యాపక బృందానికి సిబ్బందికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.


అమ్మపేరుతో ఒక మొక్క నాటండి.. అంటూ ప్లకార్డు పట్టుకుని, ఆక్సిజన్ మాస్క్ ధరించి.. మొక్కతో సీఎం సభకు వచ్చిన ఈ చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దాడి ఘటనలో కేసు నమోదు

బూర్గంపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడు మండల పరిధిలోని సందెళ్ల రామాపురం గ్రామానికి చెందిన ముత్తయ్య అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ధాన్యం లోడుతో నాగినేనిప్రోలు రెడ్డిపాలెంకు వెళ్లాడు. అక్కడ ధాన్యం దిగుమతి చేసి తిరిగి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రాము, రాఘవ, నరేంద్ర వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు అదనపు ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


జోగేష్‌ను తల్లికి అప్పగిస్తున్న ఎస్‌ఐ హరిత

ముదిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు ముదిగొండ పోలీసులు మంగళవారం అప్పగించారు. ఏపీలోని విజయవాడకు చెందిన 9ఏళ్ల ఆలకుంట జోగేష్ విజయవాడలో తప్పిపోయి ఖమ్మం నుంచి బస్సులో ముదిగొండ వస్తుండగా కండక్టర్‌కు అనుమానం రావడంతో ముదిగొండ పోలీసులకు అప్పగించారు. రెండురోజుల పాటు బాలుడి వివరాలను తెలుసుకొని విజయవాడ టుటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ముదిగొండ సీఐ మురళీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ గుమ్మడి హరిత విజయవాడ పోలీసుల ఆధ్వర్యంలో జోగేష్‌ను బాలుడి తల్లికి మంగళవారం అప్పగించారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

ముదిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సంజీవ్ మండల్‌ను ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అతని కుటుంబసభ్యులకు అప్పగించారు. ముదిగొండ మండలం పండ్రేగుపల్లిలో రెండురోజుల క్రితం మతిస్థిమితం లేకుండా సంజీవ్ మండల్ సంచరిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముదిగొండ సీఐ మురళీ ఆదేశాల మేరకు పోలీసులు అతడిని ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. సంజీవ్ మండల్ వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా అతడి వివరాలు తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈమేరకు ఎస్‌ఐ గుమ్మడి హరిత అతన్ని కుటుం బ సభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోనకల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దాదాపు 65 నుంచి 70ఏళ్ల వయస్సు గలిగిన అతని వంటిపై బ్లూకలర్ షర్ట్, గళ్ల లుంగి ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు తమకు వివరాలను తెలపాలని ఎస్‌ఐ పొదిలి వెంకన్న కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

58మద్యం బాటిళ్లు పట్టుకున్న పోలీసులు

పెనుబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో అక్రమంగా నిల్వ ఉంచిన 58 మద్యం బాటిళ్లను మంగళవారం ఎస్‌ఐ కె.వెంకటేష్ పట్టుకున్నారు. మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన తిరుమలశెట్టి కృష్ణప్రసాద్ ఈ మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తుండగా మంగళవారం వీఎం బంజర్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ మేరకు తిరుమలశెట్టి కృష్ణప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

డిజిటల్ అరెస్టు..
బెదిరింపులను నమ్మొద్దు

అడిషనల్ డీసీపీ రామానుజం

ఖమ్మంక్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అడిషనల్ డీసీపీ రామానుజం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' పేరుతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో 150మంది విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారాన్ని ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్ ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్లను తెరవద్దని తెలిపారు. డిజిటల్ అరెస్టు బెదిరింపుల గురించి భయపడవద్దన్నారు. మీరు మోసానికి గురైనట్లు భావిస్తే వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైం ఏసీపీ ఫణీందర్, సీఐ నరేష్‌కుమార్, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏడీసీపీ రామానుజం

పులుల గణన సర్వే పకడ్బందీగా చేయాలి : ఎఫ్‌డీవో

పినపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ పులుల గణనను ప్రత్యక్ష, పరోక్ష విధానాల్లో గుర్తించాలని ఎఫ్‌డీవో మక్సూద్ మోహిద్దీన్ తెలిపారు. మంగళవారం ఏడూళ్లబయ్యారం అటవీ రేంజ్ కార్యాలయంలో పులుల గణన విధానంపై రేంజర్ తేజశ్వితో కలిసి అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా ప్రతి నాలుగు ఏళ్లకు ఒకసారి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ ఆధ్వర్యంలో పులుల గణన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ గణన ఈ నెల 17 నుంచి 20 వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అటవీశాఖ డెవలప్ చేసిందని, అందులో అటవీ జంతువులు (మాంసాహార, శాఖాహార), పక్షుల వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ పులుల గణన కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బందితో ఔత్సాహికులు, జంతు ప్రేమికులు అధికారుల అనుమతితో పాల్గొన వచ్చన్నారు. కార్యక్రమంలో రేంజర్ తేజశ్వి, డీఆర్‌వోలు అరుణ, వెంకటేశ్వరరావు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.


పులుల గణనపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీవో

పంచాయతీ కార్యదర్శికి దేహశుద్ధి

దుమ్ముగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):వివాహిత మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన మండలంలోని ఓ మారుమూల గ్రామపంచాయతీ కార్యదర్శికు స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. లక్ష్మీనగరం అభయాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో అద్దెకు ఉంటున్న ఒక పంచాయతీ కార్యదర్శి స్థానిక మహిళను ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించాడు. బాధిత మహిళ ఇంట్లోకి వెళ్లిన తర్వాత అతని స్నేహితుడైన మరో కార్యదర్శి ఇంటి ముందు కాపలాగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది గమనించిన బాధిత మహిళ కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి సదరు కార్యదర్శిను చెప్పులతో కొట్టడంతోపాటు దేహశుద్ధి చేశారు. దీంతో కాపలా కాసిన మరో కార్యదర్శి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. కాగా బాధిత మహిళ మేథో వైకల్యం ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. విచారణ నిమిత్తం సదరు పంచాయతీ కార్యదర్శిని పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పాల్వంచ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పాల్వంచ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన సంగు రాఘవేంద్రరెడ్డి (25) తన స్నేహితుడు మహేష్‌రెడ్డితో కలిసి వ్యక్తిగత పనిమీద పాల్వంచ వచ్చాడు. పని పూర్తి చేసుకుని స్వగ్రామానికి తన ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమై ఆర్‌టీఏ చెక్‌పోస్టు ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే జాతీయ రహదారిపై అదే ప్రాంతంలో ఆగి ఉన్న కారు నుంచి డ్రైవర్ సోము రఘునాథరెడ్డి అకస్మాత్తుగా కారు దిగడానికి డోరు తెరిచాడు. ఈ హఠాత్పరిణామానికి వెనుకనుంచి వస్తున్న రాఘవేంద్రరెడ్డి, మహేష్‌రెడ్డిలు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుకోల్పోయి కారుడోరును అతి వేగంగా ఢీకొట్టారు. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రాఘవేంద్రరెడ్డి తలకు తీవ్ర గాయమై రక్తస్రావం ఏర్పడి అక్కడికక్కడే మృతిచెందగా మహేష్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి బావ రొడ్ల పుల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.


రాఘవేంద్రరెడ్డి (ఫైల్)

గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి

ఇల్లెందు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న పాల్వాయి శ్రీనివాసులు(59) విధులు నిర్వహిస్తుండగానే గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం జనరల్ షిఫ్టు విధులకు వెళ్లిన శ్రీనివాసులు మధ్యాహ్నం సమయంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో పనిప్రదేశంలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు శ్రీనివాసులును వైద్యచికిత్స కోసం ఏరియా సింగరేణి వైద్యశాలకు తరలించారు. కార్మికుడిని పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు శ్రీనివాసులుకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కార్మికుడు శ్రీనివాస్ మృతిపట్ల కార్మిక సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


సింగరేణి కార్మికుడు పి.శ్రీనివాసులు మృతదేహం

లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడి దుర్మరణం

ఖమ్మం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం పట్టణం, పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన కూరపాటి వెంకటేశ్వర్లు(66) ద్విచక్రవాహనంపై బట్టల వ్యాపారం చేస్తుంటాడు. ఖమ్మం నుంచి వెంకటగిరి క్రాస్‌రోడ్డు మీదుగా కోదాడ క్రాస్‌రోడ్డు వైపు వెలుతుండగా గుర్రాలపాడు ప్రాంతంలోని గ్రానైట్ ఫ్యాక్టరీల వెంకటేశ్వర్ల ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

దుమ్ముగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై మంగళవారం ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... పైడిగూడెంకు చెందిన కట్టం రామయ్య(50) వ్యవసాయ కూలి పనులు చేస్తుంటాడు. అతను ఈ నెల 1వ తేదీన తన ఇంట్లో పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పొలం పనులకు వెళ్లి వచ్చిన భార్య నాగమ్మ ఇంట్లో నురగలు కక్కుతూ పడిఉన్న భర్త రామయ్యను వెంటనే చినబండిరేవు ఆసుపత్రికి తరలించింది. మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. నిత్యం మద్యం తాగే అలవాటు ఉన్న రామయ్య రెండు రోజులుగా అధికంగా మద్యం సేవించి భోజనం మానేశాడు. మద్యం మత్తులో పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు.

రామాలయంలో మరోసారి పట్టుబడ్డ బయటి వస్త్రాలు?

- ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి
- వారం రోజుల్లో ఇది రెండోసారి

భద్రాచలం, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని భక్తులకు వస్త్రాలు విక్రయించే కేంద్రంలో మరోసారి బయటి వస్త్రాలు పట్టుబడినట్లు సమాచారం. దేవస్థానం అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో అక్కడ పలు వస్త్రాలు ఎటువంటి బార్‌కోడింగ్ లేకుండా ఉండటంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు వినికిడి. దేవస్థానం అధికారులు తనిఖీలు చేసిన క్రమంలో వారికి సుమారు పది బయటి వస్త్రాలు లభించినట్లు ప్రచారం సాగుతోంది. అలాగే విక్రయ కౌంటరు నిర్వహణలో పలు లోపాలు సైతం వారి దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయమై దేవస్థానం అధికారులు మరోసారి ఆ వస్త్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా వారం రోజుల క్రితం ఆలయ ప్రాంగణంలోని వస్త్ర సమర్పణ కేంద్రంలో కాంట్రాక్టరకు సంబంధించిన వారు వస్త్రాలను తీసుకువచ్చి అందులో పెట్టడం వాటిని ఎస్‌పీఎఫ్ దేవస్థానం సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటికి బార్‌కోడింగ్ లేకపోవడంతో ఆ సమయంలో ఎనిమిది దోతీలు, నాలుగు పంచెలు, మూడు చీరలు పట్టుబడ్డాయి. ఆఘటన మరువక ముందే మరోసారి తనిఖీల్లో బయటి వస్త్రాలు లభ్యమైనట్లు తెలుస్తోంది.


తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం



వక్ఫ్ ఉమ్మిద్ పోర్టల్, ఎస్ఐఆర్‌లో భాగస్వాములు కండి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఉమ్మిద్ పోర్టల్‌తో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో ముస్లింలందరు భాగస్వాములు కావాలని జమాతే ఉలేమా ఏహింద్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలాన సయ్యద్ షా ఎసానుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం నగరలోని టీఎన్జీవో మీటింగ్‌హాల్‌లో జేయుహెచ్ ఆధ్వర్యంలో వక్ఫ్‌ఉమ్మిద్ పోర్టల్, ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సులో మాట్లాడారు. ముస్లింలందరు ప్రభుత్వం ఏర్పాటుచేసిన వక్ఫ్ ఉమ్మిద్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో జేయూహెచ్ జిల్లాఅధ్యక్షుడు, మౌలానా మహ్మద్ సయిద్ అహ్మద్‌ఖాస్మీ, మౌలానా ముస్సదిక్‌ఖాస్మీ, మౌలానా అబ్దుల్ సత్తార్, మౌలానా హుస్సేన్, మౌలానా అబర్దుల్ కరీం రషాది, మౌలానా అబ్దుల్ గని పాల్గొన్నారు.

నిర్వాసితులకు అత్యధిక పరిహారం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 'సీతారామ' భూసేకరణ పరిహారంపై చర్చలు
- పాల్గొన్న బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి రైతులు



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూసేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం ఇవ్వడానికి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం కోసం భూసేకరణ పరిహారం నిర్ధారణకు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ చర్చించారు. సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతలపథకం 13వప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూసేకరణ చేయాల్సి ఉండగా, భూసర్వే నిర్వహించి అవార్డులుప్రకటించామన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చిభూసేకరణ చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు. బాజుమల్లాయిగూడెం గ్రామంలో ఎకరానికి రూ.2.70లక్షలు ఉందని, భూసేకరణ చట్టం ప్రకారం రెండింతలు రూ5.40 లక్షలు ఉండగా, ప్రభుత్వం పెంచి రూ.10.80లక్షలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12శాతం వడ్డీ కింద రూ.64 వేలు కలిపి మొత్తం రూ.11.44లక్షలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. రేలకాయపల్లిలో ఎకరానికి రూ.2.92లక్షలు ఉందని, భూసేకరణ చట్టం ప్రకారం రెండింతలు రూ.5.85 లక్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.11.70 లక్షలు చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్బిట్రేషన్‌లో 12శాతం వడ్డి కలిపి రూ.70,390 కలిపి మొత్తం రూ.12,40,390 ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ఠ పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టామని, భూసేకరణకు సహకరించాలని వివరించారు. ఈసమావేశంలో ఎస్డీసీ.ఎం రాజేశ్వరి, కలెక్టరేట్ భూసేకరణ అధికారులు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.



నిర్వాసిత రైతులు, మండల స్థాయి అధికారులు

ఆటో, బస్సు ఢీ: ఆటో డ్రైవర్ మృతి

ఖమ్మంరూరల్,డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన కుక్కల మధు(35) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుకుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని ఆరెంపుల గ్రామం వైపు వెళ్లాడు. తిరిగి ఖమ్మం వస్తుండగా మార్గం మధ్యలో గొల్లగూడెం వద్ద ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మధుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని అన్నం శ్రీనివాస్ సహాయంతో మృతదేహన్ని పోస్టుమార్టం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- భారీసంఖ్యలో దాఖలు
- రాత్రివరకు స్వీకరణ





మునిగేపల్లిలో కాంగ్రెస్ మద్దతుదారులతో నామినేషన్ దాఖలు చేస్తున్న రాధ, మహ్మదాపురంలో క్యూలైన్‌లో ఉన్న అభ్యర్థులు

కూసుమంచి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మండలంలో చివరి రోజున భారీ సంఖ్యలోనామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం సాయంత్రం5గంటలలోపు అభ్యర్థులు భారీసంఖ్యలో క్యూలో ఉండటంతో వారికి కూపన్లు ఇచ్చి రాత్రి పొద్దుపోయేవరకు నామినేషన్లు స్వీకరించారు. ఈ సంఖ్య బుధవారం తేలనుంది. మొత్తంగా 41 గ్రామపంచాయతీలకు గాను సుమారు 150 వరకు, వార్డులకు 800 వరకు దాఖలయ్యే అవకాశం ఉంది.

మునిగేపల్లి ఉత్కంఠ

మునిగేపల్లిలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా రామా రాధ నామినేషన్ దాఖలు చేశారు. రెబల్ అభ్యర్థిగా గంగా ప్రవంతి నామినేషన్ వేశారు. స్థానిక నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. బాధ్యతను మండల ఇన్‌చార్జి భీంరెడ్డి శ్రీనివాసరెడ్డికి అప్పగించడంతో అక్కడికి వచ్చి బుజ్జగించేందుకు ప్రయత్నించగా వినలేదు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. నామినేషన్ల కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ భీంరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, రామ శ్రీనివాసరావు, రామ వీరబద్రం, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని 40 గ్రామ పంచాయతీలకుగాను 56వార్డులకుగాను ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల చివరిరోజు కావడంతో అభ్యర్థులు సర్పంచ్, వార్డు పదవుల కోసం భారీగా నామినేషన్లు వేశారు. చివరిరోజు కావడంతోనామినేషన్లు వేసేందుకు బారులు తీరారు. మేడిదపల్లి, పాతర్లపాడు, మహ్మదాపురం, బచ్చోడు, బీరోలు, పిండిప్రోలు తదితర గ్రామాల్లో నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు క్యూలైన్లలో ఉన్నారు. మహ్మదాపురంలో సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్నారు.

సర్పంచ్‌లకు 146..
వార్డులకు 554 నామినేషన్లు

నేలకొండపల్లి: రెండోదశలో పోలింగ్ జరుగనున్న నేలకొండపల్లి మండలంలో నామినేషన్ల పర్వం ముగిసింది.32గ్రామపంచాయతీలకు మొత్తం 146మంది నామినేషన్లు వేయగా వార్డులకు 554మంది నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామాల్లో పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ పార్టీలు పొత్తులతో ముందుకు సాగుతుండగా నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో కాంగ్రెస్, తెలుగుదేశం కలిసి ఎన్నికల బరిలో నిలిచాయి.

గువ్వలగూడెం....

మండలంలో సమస్యాత్మక గ్రామంగా ఉన్న గువ్వలగూడెం గ్రామ సర్పంచ్ పదవి సైతం ఏకగ్రీవం దిశగా సాగుతున్నట్లు సమాచారం. సర్పంచ్ కాంగ్రెస్‌కు వదిలినప్పటికీ, వార్డు సభ్యుల వద్ద పేచీ వచ్చినట్లు తెలుస్తున్నది. అజయ్‌తండా పంచాయతీ సైతం ఏకగ్రీవం దిశగా సాగుతున్నట్లు సమాచారం.

ఏకగ్రీవ దిశగా పలు పంచాయితీలు?

రఘునాథపాలెం:మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయని తెలిసింది.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధికి ఆకర్షితులైన ప్రజలు, పంచాయతీలను కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీంచేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిసింది. మండలంలో సుమారు10 పంచాయతీల వరకు ఏకగ్రీవం కానున్నాయని తెలుస్తుంది. మంగ్యాతండా పంచాయతీతో పాటు చెరువుకొమ్ము తండ,రాములుతండా, శివాయిగుడెం, కోయచెలక, రేగులచెలక తదితర గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కానున్నట్లు తెలుస్తోంది.సర్పంచ్,ఉపసర్పంచ్, వార్డుల పదవులు సయోధ్యతో ఏకగ్రీం చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈపంచాయతీల్లో అన్నీ సర్పంచ్ పదవులు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే ఉన్నట్లు తెలిసింది. మిగిలిన పంచాయితీల్లో ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

ఖమ్మం రూరల్: నామినేషన్లు చివరి రోజు కావడంతో రాత్రి పొద్దుపోయే వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. మొత్తం 21 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 148 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వార్డులకు 559 మంది నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం మాత్రం సర్పంచ్ స్థానాలకు 83, వార్డులకు 392 నామినేషన్లు దాఖలయ్యాయి.

కాకరవాయి నామినేషన్ కేంద్రం వద్ద ఘర్షణ

తిరుమలాయపాలెం: మండంలోని కాకరవాయిలోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య గొడవ జరిగింది. మండంలోని సోలిపురం పంచాయితీ వార్డుసభ్యులతో పాటు సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడానికి మంగళవారం కేంద్రం వద్దకు వచ్చారు. నామినేషన్ గడువు చివరిరోజు కావడంతో 5గంటల తరువాత నామినేషన్ వేసేందుకు వెళుతుండగా బీఆర్ఎస్ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్-కాంగ్రెస్ వర్గీయులు దూషించుకుంటు ఘర్షణకు దిగిన్నారు ఎస్ఐ జగదీష్ వారిని అదుపు చేసి అక్కడ నుంచి పంపేశారు.

కాంగ్రెస్‌లో రెబల్స్ బెడద

ఒక్కో పంచాయతీలో ఇద్దరి నుంచి ఐదుగురు వరకు పోటీ

కూసుమంచి: పంచాయతీ పోరు ఆసక్తికరంగా మారింది. రాజకీయపార్టీ గుర్తులతో ఎన్నికలు జరగనప్పటికీ గ్రామాల్లో పట్టుని లుపుకోవడం కోసం ప్రధానపార్టీలు ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నాయి. అయితే అధికార కాంగ్రెస్ పార్టీకి ఆయా గ్రామాల్లో రెబల్స్ బెడద ఇబ్బందికరంగా మారింది. ఒక్కో గ్రామపంచాయతీకి రెండు నుంచి ఐదుగురు నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో వారిని బుజ్జగించేందుకు తలనొప్పిగా మారే అవకాశం ఉంది.

నేటినుంచి బుజ్జగింపులు

నామినేషన్ల ఘట్టం ముగియడంతో చరిష్మాకలిగిన నాయకులను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బరిలో దింపినప్పటికీ రెబల్స్ కూడా బరిలో నిలిచారు. కాంగ్రెస్‌లో ఎక్కువగా రెబల్స్ బరిలో ఉన్నారు. తమకే అవకాశం ఇవ్వాలంటూ నామినేషన్లు వేసిన వారు ఎవరికి వారు పట్టుదలతో ఉండటంతో ఎవరిని బుజ్జగించాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా కూసుమంచి,పాలేరు, నాయకన్‌గూడెం, జీళ్లచెరువు పెద్దపంచాయతీలతో పాటు దాదాపు 20 పంచాయతీల్లోనూ పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో జోష్ నెలకొంది. ఎన్నికలు పార్టీ పరంగా జరగనప్పటికీ చాలాకాలంగా కాంగ్రెస్‌జెండా మోస్తున్న తమకు అవకాశం ఇవ్వాలంటూ పాతకాంగ్రెస్‌కు చెందిన గ్రామస్థాయినేతలు కోరుకుంటున్నారు. ఒక్కోపంచాయతీలో సర్పంచి పదవి ఆశించి ఎక్కువమంది నామినేషన్లు వేయడంతో ఉపసంహరణకు సమయం లేకపోవడంతో ఇప్పటికే బుజ్జగింపులు ప్రారంభించారు.

మాది వ్యాపారం కాదు.. సేవ!

- ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకొని విద్యాసంస్థలు,రెస్టారెంట్లు, బార్లు, వ్యాపార సంస్థలు
- 2022 కోర్టు స్టే పేరుతో ట్రేడ్ లైసెన్స్‌ల నిరాకరణ
- కేఎంసీకి రూ. కోట్లలో గండి
- వసూళ్లు చేయలేక పోతున్న కేఎంసీ అధికారులు



ఖమ్మంకార్పొరేషన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఓవైపు వ్యాపారాలు చేసుకుంటూ.. తమది సేవా భావమంటూ కొన్ని విభాగాల వారు ట్రేడ్‌లైసెన్స్‌కు ఎగనామం పెడుతున్నారు. ఫలితంగా కేఎంసీకి కోట్లల్లో ఆదాయానికి గండిపడుతోంది. అధికారులు వారిపై ఒత్తిడి తీసుకొస్తే కార్పొరేటర్లకు ఫోన్లు చేస్తున్నారు. వసూలు చేయవద్దని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఖమ్మం విద్యా, వైద్యం, వ్యాపార రంగాల్లో హైదరాబాద్‌తో పోటీ పడుతోంది. ఖమ్మంనగరంలోని వీధివీధికి ఓ ప్రైవేట్‌హాస్పటల్, రెస్టారెంట్, హోటల్స్ వ్యాపార సంస్థలు ఇలా ఏదో ఒక్కటి ఉంటున్నాయి. కొన్ని ప్రధానమైన డివిజన్లలో నివాసాల కంటే వ్యాపార సంస్థలే అధికంగా ఉంటున్నాయి. నగరంలోని రహదారులు విస్తరణ జరగటంతో సాధారణ నివాసాలను కమర్షియల్ భవనాలుగా మార్పులు చేశారు.

సరికొత్తవాదం

నగర పాలక సంస్థలో మాది వ్యాపారం కాదని.. వ్యాపారరంగంలోకి రావని కేవలం సేవా రంగం అంటూ సరికొత్త వాదానికి తెరలేపుతున్నారు. ఖమ్మంనగరంలోని కొన్ని విద్యాసంస్థలు, బడారెస్టారెంట్లు,హోటల్స్, ఇతర వ్యాపార సంస్థలు సైతం మాది వ్యాపారం కాదంటూ కేఎంసీ అధికారులను తిరిగి ప్రశ్నిస్తున్నారు. అయితే పలుకుబడి కలిగిన వ్యాపారుల్ని కేఎంసీ అధికారులు ప్రశ్నించలేక పోతున్నారు. వారితో ట్రేడ్‌లైసెన్స్‌లు కట్టించలేక పోతున్నారు. ఏమాత్రం గట్టిగా కేఎంసీ అధికారులు లైసెన్స్‌లు అడిగినా అధికార పార్టీలో చేరిన కార్పొరేటర్లు ద్వారా ఫోన్లు చేయించి వెనక్కి పంపుతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.

2022 కోర్టు స్టే పేరుతో..

ఖమ్మంనగరంలోని ఒకరిద్దరు వ్యాపారులు 2022లో తాము చేసేది వ్యాపారం కాదని సేవా రంగం అంటూ కోర్టు నుంచి కోర్టు స్టే తెచ్చుకున్నారు. ఈ పేరుతో మూడేళ్లుగా నూతనంగా ఏర్పడిన కొన్ని ప్రైవేట్ హాస్పటల్స్, రెస్టారెంట్లు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవటంలేదు.కేఎంసీఅధికారులు ఆయా సంస్థల వద్దకు వెళ్లగా మాకుస్టే ఉందని చెపుతున్నారుకానీ,స్టేఉత్తర్వులను మాత్రం చూపటం లేదు. పైగా కార్పొరేటర్లుతో ఫోన్లు చేయించి కేఎంసీ అధికారులను వెనక్కి పంపుతున్నారు.

కేఎంసీకి రూ. కోట్లలో గండి

ఖమ్మంనగరంలో 190వరకు ప్రైవేట్ హాస్పటల్స్ ఉన్నాయి. వాటిలో 90శాతం హాస్పటల్స్ ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోవటం లేదు. మూడేళ్లుగా ప్రారంభమైన వాటిలో కొన్ని హాస్పటల్స్, విద్యాసంస్థలు, బడారెస్టారెంట్లు, హోటల్స్ సైతం లైసెన్స్‌లు తీసుకోవటం లేదు. దీంతో ఖమ్మంనగరపాలక సంస్థకు 2022 నుంచి రూ. కోట్లలో ఆదాయానికి గండి పడింది.

కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర అభివృద్ధి

బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్ రెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీరిజర్వేషన్ల విషయంలో మోసం చేసిందని రాష్ట్రస్థాయిలో 42శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి,దానిని నిలబెట్టుకోలేదన్నారు. జిల్లాలో బీసీలకు కేవలం 11.9శాతం రిజర్వేషన్ మాత్రమే కలిపించిందని,ఇది బీసీలను ఎంతగా మోసం చేశారో తెలియచేస్తుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌పార్టీ బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తోందన్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ప్రజలంతా బీజేపీ పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు.ఈసమావేశంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, నాయకులు సన్నె ఉదయ్ ప్రతాప్,వక్కలంక సుబ్రహ్మణ్యం, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వర్లు, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్,డొంగల సత్యనారాయణ, శీలంపాపారావు,రవిరాథోడ్, వీరెల్లి రాజేష్,సుదర్శన్ మిశ్రా, దొడ్డ అరుణ, నెల్లూరి బెనర్జీ, రజనిరెడ్డి పాల్గొన్నారు.

గుట్ట ఆలయంలో యుగంధర్ పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న యుగంధర్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్రమైన స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ సందర్శించారు. అనంతరం ఆలయ పరిసరాల్ని పరిశీలించారు. గుట్టపై భాగంలోని కోనేరు, నవగ్రహాల పరిసరాలు, అన్నదాన మండపం, నిరుపయోగంగా మారిన ఫౌంటెన్, వాటర్ ట్యాంక్ పరిసరాలు, కొండపై భాగం, మెట్ల మార్గం ఇరువైపులా ఉన్న పరిసరాల్ని యుగంధర్ పరిశీలించారు. పరిశుభ్రత లోపించడంతఓ పారిశుధ్య సిబ్బందికి పరిసరాలు శుభ్రం చేయాల్సిందిగా ఆదేశించారు. సుమారు 20మంది మునిసిపల్ కార్మికులు ఆలయ గుట్టపైఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రపరిచారు. సాయంత్రం తిరిగి ఆలయానికి వచ్చిన యుగందర్ పరిసరాలను తిరిగి పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోతుల భయంతో బయటకు రాలేకపోతున్నాం

సత్తుపల్లిలో బాధితులు ఆందోళన

సత్తుపల్లిరూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లలితకుమారి ఆసుపత్రి రోడ్డు చివరనున్న అయ్యగారిపేట, మారుతినగర్ ప్రాంతాలో కోతుల బెడదతో స్థానికులు మంగళవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మారుతి నగర్ నుంచి రింగ్ సెంటర్ మీదుగా మునిసిపల్ కార్యాలయం వద్ద చిన్నారులు, వృద్ధులు, మహిళలంతా కలిసి కోతుల నుంచి రక్షణ కల్పించాలంటూ ర్యాలీగా వెళ్లారు. కొన్నేళ్లగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న తాము ప్రశాంతంగా ఉన్నామని, కానీ ప్రస్తుతం కోతులు దండు రాకతో ఇళ్లోలో తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తుందని, ఏమరపాటుగా ఉంటే ఇళ్లలోకి చొరబడి సామాన్లు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడం, కూరగాయలు, మొక్కలను పీకివేయడం చేస్తున్నాయని వినతిపత్రంలో వాపోయారు. ఇప్పటివరకు 8మందిపై దాడిచేసి కరిచాయని, ఇంకా చాలామంది గాయాలపాలయ్యారని, చిన్నారులు రోడ్లపై తిరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కోతుల నుంచిరక్షణ కల్పించాలంటూ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ కొండ్రా నర్సింహ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముగ్గురు బాలికల అదృశ్యం

- బాత్రూంకు వెళుతున్నామని చెప్పి.. స్కూల్ నుంచి బయటకు
- రైల్వేస్టేషన్ వైపు వెళ్లినట్టు సీసీ కెమెరాలో రికార్డు
- రెండు బృందాలతో గాలింపు.. కాజీపేటలో గుర్తింపు

ఖమ్మం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాత్రూంకు వెళుతున్నామని చెప్పి.. ముగ్గురు బాలికలు స్కూల్ నుంచి అదృశ్యమైన ఘటన ఖమ్మం నగరంలో మంగళవారం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ఓ బాలిక, నగరానికి చెందిన మరో ఇద్దరు బాలికలు ఏడో తరగతి చదువుతున్నారు. పాఠశాలలో ప్రస్తుతం టీటీసీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో.. మధ్యాహ్నం మాత్రమే తరగతులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో స్కూల్‌లో బాత్రూంకి వెళుతున్నానని చెప్పి.. ఓ బాలిక బయటకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మరో ఇద్దరు బాలికలు కూడా బాత్రూంకి వెళ్తున్నామంటూ చెప్పి.. బయటకు వచ్చారు. అలా చెప్పి వెళ్లినవారు ఎంతకూ తిరిగి పాఠశాలకు రాకపోవడంతో.. స్కూల్ సిబ్బంది చుట్టుపక్కల వెదికారు. ఎక్కడా ముగ్గురు బాలికల ఆచూకీ లభించకపోవడంతో.. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే బాలికల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఖమ్మంలోని పాఠశాలకు చేరుకొని ఆ తర్వాత నగర వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, ముగ్గురు బాలికలు స్కూల్ దగ్గర నుంచి రైల్వేస్టేషన్ వైపు పరిగెత్తుకు వెళ్లినట్టు రికార్డయ్యింది. అయతే రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో.. అక్కడ సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీంతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ఓ బృందం విజయవాడ వైపు, మరో బృందం హైదరాబాద్ వైపు వెళ్లి బాలికల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. కాగా.. బాలికల పుస్తకాలను పరిశీలించగా, కొన్ని ఫోన్ నెంబర్లు దొరకడంతో.. వాటి ప్రకారం పోలీసులు విచారణ చేపట్టారు. చివరకు వారు కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఉన్నట్టు గుర్తించి వారిని ఖమ్మం తీసుకొస్తున్నారు.

న్యాయవాద సంక్షేమానికి కృషి

హైకోర్టు న్యాయవాది భాస్కర్

ఖమ్మంలీగల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): న్యాయవాద సంక్షేమానికి కృషి చేస్తానని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ హామీ ఇచ్చారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఖమ్మం బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే న్యాయవాద సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, అడ్వకేట్ ప్రొటక్షన్ యాక్ట్ వెల్ఫేర్ ఫండ్, న్యాయవాదులకుహెల్త్‌ఇన్సూరెన్స్, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, ఇళ్లస్థలాలు తదితర సంక్షేమ పథకాలు, న్యాయవాదులకు అందే విధంగా కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ కార్యదర్శి గద్దల దిలీప్ కుమార్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్

మంత్రి పొంగులేటిని కలిసిన చాంబర్ నూతన పాలకవర్గం

ఖమ్మంమార్కెట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన పాలకవర్గ సభ్యులు నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటిని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జీవై.నరేష్, ఉపాధ్యక్షుడు బత్తిని నర్సింహరావు, సహాయ కార్యదర్శి బాదెరమేష్, సెంట్రల్ ఈసీ సభ్యులు మాటేటి కిరణ్, రాయపూడి రవి సత్కరించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెట్ శిక్షణ తరగతుల ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్షకు (టెట్) సంబంధించిన శిక్షణ తరగతులు మంగళవారం నగరంలోని సంఘం భవనంలో ప్రారంభమయ్యాయి. శిక్షణతరగతులనుద్దేశించి రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా.దుర్గా భవాని మాట్లాడారు. ప్రతీరోజు సాయంత్రం 6నుంచి తరగతులు నిర్వహిస్తామని అన్నారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి.నాగేశ్వరరావు,నాగమల్లేశ్వరరావు,రాంబాబు,షమి,రాందాస్, సురేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పంటల నమోదును పరిశీలించిన డీఏవో

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అష్ణగుర్తి గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటల నమోదును మంగళవారం డీఏవో పుల్లయ్య పరిశీలించారు. మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ.. అగ్రిమెంట్లు లేకుండా విత్తన మొక్కజొన్న సాగుచేయవద్దని స్పష్టం చేశారు. వరిపొలాలను సందర్శించి అక్కడి రైతులతో మాట్లాడుతూ వరికొయ్యలను కాల్చవద్దని, కోసిన తర్వాత నీరు పెట్టి కలియదున్నితే అది ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. ఏడీఏ తుమ్మల కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవో వాసంతి, రైతులు వెంపటి నాగేశ్వరరావు, తాళ్ల శ్రీనివాసరావు, పయ్యావుల హరి పాల్గొన్నారు.

విజయావకాశాలు గల అభ్యర్థులను ఎంపిక చేయాలి

» కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం



మంత్రి పొంగులేటిని ఆహ్వానిస్తున్న నాయకులు

కల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో విజయ అవకాశాలు గల అభ్యర్థులనే కాంగ్రెస్ తరుపున ఎంపిక చేయాలిని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్ధేశం చేశారు. మంగళవారం కల్లూరు మండలంలోని నారాయణపురంలో మంత్రి పొంగులేటిని పలు గ్రామాల నాయకులు, సర్పంచి బరిలో ఉండే ఆశావహులు నేరుగా వచ్చి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి గ్రామాల వారిగా కాంగ్రెస్ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఇదే సందర్భంగా సత్తుపలి ఎమ్మెల్యే మట్టా రాగమయి,కాంగ్రెస్ నాయకుడు దయానంద్‌లతో కూడా మంతనాలు చేశారు. అనంతరం పొంగులేటి నర్సింహారెడ్డిని పరామర్శించారు.

ఐక్య క్రిస్మస్ వేడుకలకు మంత్రి పొంగులేటికి ఆహ్వానం..

కల్లూరులో ఈ నెల 9 తేదిన జరిగే ఐక్య క్రిస్మస్ వేడుకలకు మంత్రి పొంగులేటిని ఏబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్‌తో పాటుగా ఆ సంఘ నాయకులు, పాస్టర్లు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రేయర్ సెల్ జిల్లా అధ్యక్షుడు టి నిర్మల్‌కుమార్, మీడియా సెల్ దాసరి డేవిడ్ రాజు, మండల అధ్యక్షుడు పి దయాకర్, ప్రదాన కార్యదర్శి ఎం జాన్, కోశాధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ క్యాంప్

సత్తుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నేడు టీజీఆర్టీసీ ఉచిత బస్‌పాస్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమం నిర్వహకులు వలపర్ల రవికుమార్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరవ్వనున్నారన్నారు. 50శాతం రాయితీతో అందించే ఈ పాస్‌లు డీలక్స్ సర్వీస్ వరకు వర్తిస్తుందని, స్థానిక సిద్దారం రోడ్‌లోని స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమంలో క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు9502549551సంప్రదించాలని రవికుమార్ కోరారు.

'న్యూలిటిల్‌ఫ్లవర్'లో క్విజ్ పోటీలు



విజేతలను అభినందిస్తున్న భూమేశ్వరరావు

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం ఫూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ స్కిల్ టెస్ట్ ఫర్ సోషల్ కాజ్ అనే అంశంపై జరిగిన క్విజ్ పోటీలో పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. విజేతలను కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూస్, ఏవో ఎస్.నర్సింహారావు, ఫౌండేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.నసీర్, షాదాన్ నసీర్, షేక్.సమీర్ అభినందించారు.

వైరా రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదల

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌లో ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన ఉచిత చేపపిల్లలను జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. 8.55లక్షల చేపపిల్లలను విడుదల చేశామని శివప్రసాద్ తెలిపారు. నీటిపారుదలశాఖ ఏఈఈ వెంకట్రాము, వైరా చేపల సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్.రహీం, షేక్.రహీం, ఉపాధ్యక్షుడు షేక్.సైదులు, పాలకవర్గ సభ్యులు షేక్.జానిమియా, షేక్.ఉద్దండు, జి.జ్ఞానరత్నం, సీహెచ్.రామారావు, షేక్. చాంద్‌మియా పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఏవమ్'లో గర్ల్స్ హైస్కూల్‌కు గుర్తింపు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయాల సర్వేలో సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల పాఠశాల 5స్టార్ రేటింగ్ పొందగా కేటగిరి2 అర్బన్‌లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతులమీదుగా పాఠశాల పీడీ శ్రీదేవి ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్య జైని, జిల్లా సమ్మిళిత విద్యా కో-ఆర్డినేటర్ బాజోజు ప్రవీణ్‌కుమార్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, ఏఎంఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉంటూ తమను తాము రక్షించుకున్న తర్వాత ఆస్తులను కాపాడాలని అగ్నిమాపక శాఖ అధికారి వై.వెంకటేశ్వరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మైనార్టీ గురుకులంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కే.వెంకట్రామయ్య, అగ్నిమాపక సిబ్బంది ఈ.రమేష్‌బాబు, ఎం.మోషేబాబు, వై.అనిల్‌కుమార్, కే.బాబూరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్

కారేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగరేణి డివిజన్ గుర్తింపు పొందిన విద్యాసంస్థల సంఘం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎర్ర సాయిప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని లిటిల్ స్టార్ పాఠశాలలో నిర్వహించిన ఎన్నికలలో సింగరేణి డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాడెంట్ ఉపాధ్యాయులు లిటిల్‌స్టార్ పాఠశాల కరస్పాడెంట్ అయిన ఎర్ర సాయిప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గుర్తింపు పొందిన విద్యాసంస్థల అధ్యక్షులు కాంతరావు, జెమ్సినాకో, మినిజోజో, మహేష్, కోటేశ్వరరావు, మల్లెల నాగేశ్వరరావు, శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత నామినేషన్లకు ఏర్పాట్లు

సత్తుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మూడవ విడత జరగబోయే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అధికారులు సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం 43 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో కేటాయించిన పంచాయతీలకు సంబంధించి పోటీ చేయబోయే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. మూడవ విడతలో పోటీ చేయబోయే సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థులు బుధవారం నుంచి ఈ నెల5 వరకూ తమ నామినేషన్ల పత్రాలను దాఖలు చేయాల్సి ఉంది.

129 పంచాయతీల్లో 1208 వార్డులు

సత్తుపల్లి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో మొత్తం 130 గ్రామ పంచాయతీలు ఉండగా పెనుబల్లి మండలం గౌరారం గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగడం లేదు. 129 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. సత్తుపల్లి మండలంలో 21 గ్రామయ పంచాయతీల్లో 208 వార్డులు ఉండగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు గాను 7 క్లస్టర్లు ఏర్పాటు చేశారు.



పంచాయతీ కార్యలయం

వేంసూరు మండలంలో 26 గ్రామ పంచాయాలు, 244 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలంలో 8 క్లస్టర్లలో నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. పెనుబల్లి మండలంలో ఎన్నికలు జరగనున్న 32 పంచాయతీలు, 290 వార్డులకు సంబంధించి 9క్లస్టర్లు ఏర్పాటు చేశారు. కల్లూరు మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 214 వార్డులలో పోటీ చేయనున్న అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు గాను 10క్లస్టర్లు ఏర్పాటు చేశారు. తల్లాడ మండలంలో 27 గ్రామ పంచాయతీలు, 252 వార్డులకు సంబంధించి 9 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఏ క్లస్టర్ పరిధిలో ఏ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుందో అధికారులు ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పించారు. బుధవారం నుంచి ఈ నెల అయిదో తేదీ వరకూ ప్రతి రోజు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకూ నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు.

కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయితీల ఎన్నికల ప్రక్రియకు (నామినేషన్ల) గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నామని మండల పరిషత్ అధికారి డి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు మెటీరియల్స్ అందజేశారు.

కారేపల్లి: మండలంలోని 41 గ్రామపంచాయతీలు,356వార్డులకు గాను నేడు బుదవారం నుంచి 5వతేదివరకు మూడవవిడత నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఏ.రమేష్ తెలిపారు.మంగళవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నామినేషన్లకు సంబందించి అన్ని కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసిన్నట్లు తెలిపారు.

కేంద్రాల పరిశీలన

ఏన్కూరు: మండలంలో మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను మంగళవారం కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ సందర్శించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శేషగిరిరావు, కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, సురేష్‌బాబు, ఎంపీవో జీవీఎస్ నారాయణ, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్

కల్లూరులో వేడెక్కిన రాజకీయం



కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న పసుమర్తి మెహన్‌రావు

కల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ఎన్నికల రాజకీయ సమరం వేడేక్కింది. బుధవారం నుంచి కల్లూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు గాను నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు స్థానిక పోరులో తమ పార్టీల తరపున అభ్యర్థిత్వం ఖారారు చేసేందుకు గాను ముఖ్య అనుచరులచే సన్నాహక సమావేశాలు నిర్వహించడంతో గ్రామ రాజకీయాలు ఉత్కంఠ భరితంగా మారనున్నాయి. సోమవారం మండంలోని చెన్నూరు గ్రామంలో ప్రధానంగా అధికార కాంగ్రెస్ ఒక వైపు ముఖ్య అనుచరులచే సమావేశం నిర్వహించగా, మరో వైపున అందుకు దీటుగా బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యలచే మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు సమక్షంలో సన్నాహక సమావేశం నిర్వహించింది. నామినేషన్ ప్రక్రియ సమీపిస్తున్నందున సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల్లో విజయ ఆవకాశాలు ఉన్న అభ్యర్థులను తమ పార్టీల తరపున నిలబెట్టేందుకు ఆయా పార్టీల స్థానిక నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ప్రధానంగా ఆయా గ్రామాల్లో అధిపత్యం వహిస్తున్న ప్రధాన నాయకులు రిజర్వుడు అయిన స్థానాల్లో అభ్యర్థిత్వం ఖారారుపై ఆయా పార్టీల ముఖ్య అనుచరుల ద్వారా అభిప్రాయ సేకరణ చేశారు. ప్రత్యర్థి పార్టీల తరుపున ఎంపిక చేసిన అభ్యర్థి సామాజిక వర్గం, స్థానికంగా బలబలాలు రాజకీయ సమీకరణలను పరిగణాలోకి మరో ప్రధాన రాజకీయ పార్టీ వారు కూడా అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఎంపిక చేసేందుకు రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలిసింది. మండలంలో 23 గ్రామ పంచాయితీలు ఉండగా అందులో అన్‌రిజర్వుడు 12 స్థానాలు, బీసీ రిజర్వుడు 2, ఎస్సీ 7 స్థానాలకు రిజర్వుడు అయ్యాయి. ఇక అన్ రిజర్వుడు స్థానాల్లో కూడా ప్రధాన రాజకీయ పార్టీల తరపున అభ్యర్థిత్వం కోసం ఆశావహులు పోటిలు పడుతున్నారని సమాచారం.

గత ప్రభుత్వ అభివృద్ధి పనులతో ఓట్లు అడుగుదాం.

కల్లూరు మండల చెన్నూరు గ్రామంలో జరిగిన బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మండల అధ్యక్షుడు పాలెపు రామారావు ప్రసంగిస్తూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభత్వంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రధాన ఎజెండాగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడుగుదామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి ఏమిటో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. విజయ ఆవకాశాలు ఉన్న అభ్యర్థిని ఏకాభిప్రాయంతో తమ పార్టీ తరుపున బరిలో ఉంచడం జరుగుతుందన్నారు. సీపీఎం కూడా తమకు స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. నామినేషన్ల ఘట్టం ప్రక్రియలో సర్పంచు, వార్డు సభ్యులకు గాను దీటైన వారిని బరిలో నిలబెట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకుని స్థానికంగా పార్టీ శ్రేణులు, అభిమానులు ఐకమత్యంగా పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఇలా సోమవారం మండలంలోని లింగాల, ఎర్రబోయనపల్లి, చిన్న కోరుకొండి, పోచారం, పేరువంచ, చంద్రుపట్ల తదితర గ్రామాల్లో సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థిత్వం ఖారారుపై ప్రధాన రాజకీయ పార్టీల సన్నాహక సమావేశాలు నిర్వహించారు.



బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న మండల అధ్యక్షుడు రామారావు

కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయుధంగా తీసుకుని ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి మోహనరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం చెన్నూరులో కూడా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. విజయ అవకాశాలు ఉన్న అభ్యర్థిత్వం కోసం తమ పార్టీ నుంచి ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలను ఎన్నికల అస్త్రంగా తీసుకుని ఓటర్లను ప్రసన్నం చేసుకుని గెలుపించుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులు, అభిమానులపై ఉందన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

» ఏఎంవో ప్రభాకర్‌రెడ్డి

మధిర రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) పెనర ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మధిర మండలంలోని ప్రభుత్వ సీపీఎస్ ఉన్నత పాఠశాల, మడుపల్లి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల్లోని తరగతి గదులను ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. శుభ్రమైన పరిసరాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో కూడిన తరగతి గదులు, అనుభవం ఉన్నటువంటి ఉపాధ్యాయులు డిజిటల్ టెక్నాలజీని ఇంటిగ్రేట్ చేస్తూ బోధన అభ్యాసన ప్రక్రియలు నిర్వహించాలని సూచించారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ రూ.3వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను పాఠశాలకు అందించడం పట్ల ప్రభాకర్ రెడ్డి అభినందించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనకల్: నిబందనల మేరకు పీఎంశ్రీ గ్రాంట్లను వినియోగించాలని ఏఎంవో పి. ప్రభాకరరెడ్డి సూచించాఉ. మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. గణిత ల్యాబ్, గ్రంథాలయ గదులను పరిశీలించారు. పీఎంశ్రీ గ్రాంట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేయాలని కోరారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలను సాదించాలని కోరారు.



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఏఎంవో ప్రభాకర్‌రెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

» సీఐ మురళి

ముదిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణా తరలింపును సిబ్బంది అడ్డుకోవాలని అలా కాకుండా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఓ.మురళీ హెచ్చరించారు. మంగళవారం వల్లభి వద్ద అంతర్రాష్ట చెక్‌పోస్టును సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో కుమారుడు ఉద్యోగి అయితే తన కారుపై ప్రభుత్వ విధులు అనే స్టిక్కర్ ఉండడంతో ఆ స్టిక్కర్‌ను తొలగించారు. నిబంధనలు పాటించకపోతే ఎరైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వల్లభిలోని ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సీఐ మురళీ పరిశీలించారు.



కారుపై ఉన్న స్టిక్కర్‌ను తొలగిస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌లో చేరిన వీరభద్రారెడ్డి

పెనుబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కర్నాటి వీరభద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్‌నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భద్రారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సత్తుపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, అలుబోజు చిన్న నర్సింహస్వామి పాల్గొన్నారు.



వీరభద్రారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

అందని వేతనాలు.. సమ్మెకు నోటీసులు

కల్లూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక అధికారులకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యేలకు విజ్ఞాపనలు చేసిన స్పందించలేదన్నారు. ఈ నెల 18 వ తేది నుంచి కార్మికులు మునిసిపాలిటీ పరిధిలో పూర్తిగా విధులు బహిష్కరిచి నిరవధిక సమ్మెబాట పడుతున్నట్లు స్పష్టం చేశారు. మునిసిపాలిటీ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావుకు కార్మికులు సమ్మెనోటీసు అందించారు. ఏఐటీయూసీ నాయకులు దామాల దయాకర్ రావు, మునిసిపాలిటీ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు ఊడల కృష్ణమూర్తి, కార్యదర్శి వజీర్ మీయా, నాయకులు ప్రకాష్, చింతపల్లి శ్రీను, సుధాకర్, ప్రవీణ్, నరిసింహారావు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రేజర్లలో కొలువైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో భగవద్గీత జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, వసంతలక్ష్మీ, భీమిరెడ్డి నరసింహారెడ్డి, పుల్లారెడ్డి, కేశవరెడ్డి, వెంకటరామిరెడ్డి, కృష్ణస్వామి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మధిరరూరల్: గీత ప్రచార పరిషత్ మధిర వారి ఆధ్వర్యంలో భరత్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారని స్కూల్ కరస్పాండెంట్ శీలం విద్యాలత వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థులను స్కూల్ యాజమాన్యం శీలం వెంకటరెడ్డి, విద్యాలత, ఉపాధ్యాయులు పద్మావతి, వరలక్ష్మీలు అభినందించారు.

తల్లాడ: మైసూరు దత్తపీఠం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో తల్లాడకు చెందిన కర్నాటి అనూషకు అత్యున్నతమైన ఉత్తమశ్రేణి స్థానం దక్కింది. అనూష గణపతి సచ్చిదానంస్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. అనూషను బీజేపీ జిల్లా నాయకుడు అపతి వెంకట రామారావు, పలువురు ప్రముఖులు అభినందించారు.

కల్లూరు: భగవద్గీత పఠనంలో ప్రతిభ కనబరిచిన కల్లూరు మండలం లింగాల వాసి తోట గిరిజ మైసూరు దత్తపీఠాధిపతి సచ్చిదానందస్వామి చేతుల మీదగా మంగళవారం బంగారు పతకం అందుకున్నారు. మండలంలోని లింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దేవరపల్లి మంగపతి కుమార్తె తోట గిరిజ భగవద్గీతలోని 18 ఆధ్యాయాలలో గల 700 శ్లోకాలను కంఠస్థం చేయడంలో తన సత్తాచాటారు. ఈ సందర్భంగా దత్తపీఠాధిపతి సచ్చిదానందస్వామి గిరిజను అభినందిస్తూ బంగారు పతకంతో పాటుగా ప్రశంసాపత్రం అందించి శుభాశీస్సులు అందించారు. లింగాల గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు గిరిజను అభినందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాధకృష్ణ, దేవరపల్లి లక్ష్మీ పాల్గొన్నారు.



రేజర్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



మధిరలో విద్యార్థులను అభినందిస్తున్న శీలం వెంకటరెడ్డి,



అనూషకు గోల్డ్‌మెడల్ అందిస్తున్న గణపతి సచ్చిదానంద

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ముఖ్యమంత్రి, ఉమ్మడి ఖమ్మంజిల్లా పర్యటనలకు అయిన ఖర్చంత కూడా రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించలేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. బీసీలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వైరాలోని సుందరయ్యనగర్‌లో ఇటీవల మృతిచెందిన చింతనిప్పు సుధాకర్ చిత్రపటానికి మంగళవారం ఆయన నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో తాతా మధుసూదన్ మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఈ జిల్లాలో అత్యధిక బీసీ జనాభా ఉన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుమలాయపాలెం మండలాల్లో బీసీలకు జీరో రిజర్వేషన్లు ఇచ్చారని ఇది బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విమర్శించారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, మాజీ కౌన్సిలర్ వనమా విశ్వేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు మద్దెల రవి, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, ఏదునూరి శ్రీనివాసరావు, ఆదూరి ప్రేమ్‌కుమార్, నందిగామ మనోహర్ పాల్గొన్నారు.